# మానవత

సారము లేనియట్టి భవసాగరమందు మునింగి తేలుచున్
దారియుతెన్నుగానక తత్తరమునందెడి మానవుండ నీ
కోరిమి యించుకంత మదినూనుచు భక్తిని కల్గి చూడు శ్రీ
కారుడు సత్యసాయి నిను కావగ వచ్చిన నావగాంచవే!

ప్రేమస్వరూపులారా!

జీవితము చాలా విలువైనది. దీనికి ఆధారమైనది ప్రాణము. కాని, ఈ ప్రాణమును సహితము లక్ష్యముచేయక సాధించవలసిన లక్ష్యములు ఎన్నియో వుంటున్నవి. ఎన్ని సాధించినప్పటికిని, ఇంకనూ సాధించవలసిన ఎన్నియో వుంటున్నవనే ఊహచేత మానవుడు ముమ్ముందు జీవితమును సాగించుకొనుచున్నాడు. ఆ సంతృప్తియే మానవునకు సంతృప్తి.

ఐకమత్యము జీవితముయొక& ప్రధాన సూత్రము. సామూహిక కృషియే జీవిత మార్గము. అదియే శ్రీరామరక్ష. మానవునకు, మానవునకు మధ్యనున్న సంబంధబాంధవ్యములను గుర్తించి వర్తించే విధానమును ఏనాడు గుర్తించగలడో, ఆనాడు మానవత్వముయొక్క పవిత్రతను తాను అందుకోగలడు. ఈ డెబ్బది కోట్ల భారతీయులయందు ఒక్కొక్కనికి ఒక్కొక్క ప్లస్ అనే భావాన్ని పెంచుకుంటూపోతే, భారతీయులు ఎంతో ఆనందమును, దాని ఫలితమును అనుభవిస్తారు.

మానవులలో సంబంధబాంధవ్యములు లేకపోవటముచేతనే స్వార్థము, అహంకారము, అసూయాది పైశాచిక ప్రవృత్తులు ప్రళయతాండవము సలుపుచుండు జీవితము అర్థరహితముగా రూపొందుతున్నది. కనుకనే, చల్లటి గాలి, సూర్యకిరణములు, వర్షబిందువులు ఇంక ఏ పదార్థముకూడా ఉచితముగా లభించటము లేదు. ఇంకా మానవత్వముయొక్క విలువ దిగజారిపోవటముతో ఏమాత్రమూ సందేహము లేదు. ఉన్నత ఆదర్శానికై జీవితమును అంకితముచేసే మానవత్వము ఈనాడు కనిపించటము లేదు. జగత్తుకై తమ జీవితాన్నైనా త్యాగముచేసి, పవిత్ర ఆశయాలను నిలబెట్టుకొనే మానవత్వమును పోషించుకోటానికి తగిన ప్రయత్నము సలపాలి.

దేశమనగా మనతో మాట్లాడని నేల కాదు. నిత్యమూ మన కండ్ల ఎదుట ప్రత్యక్షమైన సజీవసమాజమే దేశము. ప్రతి మానవుడూకూడా సమాజముయొక్క సంతోషమే తన సంతోషముగా భావించాలి. అప్పుడే భారతదేశముగాని, ఏ ఇతర దేశముగాని సుక్షేమాన్ని అందుకొనేందుకు తగిన అర్హత కలిగి వుంటుంది. సమాజముయొక్క సుఖమునందే తన సుఖముకూడా ఇమిడి వున్నదనే సత్యాన్ని గుర్తింటము అత్యవసరము. తన మనస్సును, బుద్ధిని, కాయమును తన నిమిత్తమేకాక సమాజము నిమిత్తమునకై అంకితము గావించాలి.

భగవంతుడనగా ప్రకృతియొక్క శక్తియే. నిర్విరామముగా, అర్థముగాని ఆవేదనలచే అప్రాప్తప్రాప్తములకై ప్రాకులాడుచున్న మానవుని చూచి, ప్రకృతి నవ్వుతుంది. ప్రకృతి ఆచరించే పవిత్రసూక్తులను గుర్తించటానికి ప్రయత్నించినప్పుడు ప్రకృతి, అగాధమైన,అనంతమైన అర్థముతో కూడివున్నదని తెలుస్తుంది. భూమి గంటకి వేయి మైళ్ళ వేగముతో తనకు తాను తిరగటముచేత రాత్రిబవళ్లు ఏర్పడుతున్నవి. రాత్రింబవళ్లు ఏర్పడకున్నయెడల మానవుడు ఈ జగత్తులో నివసించటానికి వీలుకాదు. ఇంతియే కాదు. గంటకు 66వేల మైళ్ళ దూరము సూర్యుని చుట్టూకూడా తిరుగుతున్నది. దీనిచేత ఋతువులు ఏర్పడుచున్నవి. ఋతువుల వల్లనే వర్షములు కురియటము, పంటలు పండటము, మానవుని తిండిపదార్థములు ఏర్పడటము. ఈ ఋతువులవలన భూమికి వచ్చిన సుఖమేమాత్రమూ లేదు. రాత్రింబవళ్లచేత తనకు లభించేటువంటిది ఏమాత్రమూ లేదు. స్వార్థరహిత కర్మను ఆచరించే ప్రకృతియొక్క మార్గమును ప్రతి మానవుడు కూడను అనుసరించాలి.

జీవితమునకు ప్రధాన సూత్రము నడవడిక, మరణించిన తరువాతకూడా తన నడత, జగత్తున నిలచిపోతున్నది. నడతయే మానవుని బ్రతుకు. నడతలేని బ్రతుకు కేవలము జీవితములేని బ్రతుకే. లోకములో జ్ఞానము అన్నింటికంటే బలమైనదని చెప్పుతుంటారు. కాదు, కాదు. గుణమునకు మించిన బలము ఈ జగత్తునందు కానరాదు. ఎట్టి ధనముగాని, విద్యగాని, అధికారముగాని గుణము ముందు ఏమాత్రమూ కూడా పనికి రాదు. గుణము గ్రంథము వలన లభించేది కాదు. ఇది సమాజముయొక్క సన్నిహిత బంధవ్యములచేతనే లభిస్తుంది. దయ, ధర్మము, సానుభూతి, కరుణ ఇత్యాది పవిత్ర గుణములు లేకపోవుటచేతనే మానవత్వమనేది గుర్తించుకోలేని పరిస్థితి ఈనాడు తయారైనది. మానవత, మానవత. ఏమిటీ మానవతా గుణములు? అసూయ మానవ గుణమా! అహంకారము మానవ గుణమా! అహంకారము మానవ గుణమా! క్రోధము మానవ

గుణమా! స్వార్థము మానవ గుణమా! కాదు, కాదు. ఇవి మృగలక్షణములుఈ మృగలక్షణములను నేను మానవతా గుణములుగా విశ్వసించి మనము చలామణీ అవుతున్నాము.

నేను అనే భావము లేకుండా, నాది అనే అభిమానము లేకుండా సర్వ కర్మలూ కూడను భగవత్ ప్రీత్యర్థముగా ఆచరించి, తత్యాగమును అనుభవించే మానవులు లోకములో ఎందరో వున్నారు. లేరని అనుకోటము భ్రాంతి. పదిమంది చెడ్డవారున్నారంటే, వారిలో ఒక్కడైనా మంచివాడుంటాడు. పదిమంది మంచి వారిలో ఒక్కడైనా దైవాభిమాని వుంటాడు. పదిమంది దైవాభిమానులలో ఒక్కడైనా ఆచరణయందు అనుసరించేవాడు వుంటాడు.

దేహమనే పాత్రను కర్మక్షేత్రమనే జగత్తునకు పంపించాడు, ఏదో నిమిత్తమై. చక్కగా యోచన చేసుకోండి. ఇంట్లో పెండ్లి జరుగుతుంటే, ఎవ్వరో శ్రీమంతుల ఇంటినుండి వండుకోటానికి మనము పాత్రలను తెచ్చుకుంటాము. ఈ పాత్రలను తిరిగి ఏ స్థితిలో యజమానికి అందిస్తాము? తెచ్చుకొన్న పాత్రలను చెడగొట్టి అంధించేవాడు అధముడు. తెచ్చుకొన్న పాత్రను వినియోగించి దానిని పరిశుద్ధముచేసి ఉన్నది ఉన్నట్లుగా అందించేవాడు మధ్యముడు. అట్లుకాకుండా వినియోగించి, 'ఆ యజమానివలన నా కార్యము చక్కగా జరిగింది' అని భావించి, పాత్రలను చక్కగా తోమి, దానికి కళాయి వేయించి, పరిశుద్ధముచేసి ఇచ్చేవాడు ఉత్తముడు. ఈ లోకకల్యాణ నిమిత్తమై దేహమనే పాత్రను తెచ్చుకొని, దానిని చెడగొట్టి, దేవునికివ్వటము ఎంత అధమస్థితో ఆలోచించండి. వచ్చే సమయములో ఈ పాత్ర ఎంతో నిశ్చలంగా, నిర్మలంగా, నిరపరాధిగా వుంటుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలతో చిల్లులు పడకుండా వచ్చింది ఈ పాత్ర. దానిని తెచ్చుకొని, దీనికి కామమనే ఒక చిల్లు, క్రోధమనే ఒక చిల్లు, ద్వేషమనే ఒక చిల్లు.. ఇన్ని చిల్లులు కొట్టి తిరిగి ఈ పాత్రను పరమాత్మకు అర్పిస్తే, ఇది సరైన మర్యాదా! కనుక, ఆధ్యాత్మికమనే కళాయి దీనికి వేసి, తద్వారా దీనిని పరిశుద్ధముచేసి, 'అయ్యా! స్వామీ! నీవిచ్చిన పాత్రను ఏ ద్వేషము, ఏ అసూయ, ఏ అహంకారమనే చిల్లులు లేకుండా దీనిని పరిశుద్ధముగా నీకు అందిస్తున్నాను' అని తన జీవితమును అర్పితము గావించేవాడు ఉత్తముడు.

సత్యసాయి సంస్థలు అహంకార రహితమైన, స్వార్థరహితమైన, ప్రేమమయమైన సేవను ఆచరించుటకు ప్రయత్నించినప్పుడే, మన సంస్థలు సార్థకములౌతాయి. ఈ సంస్థలు పెట్టటము పేరుప్రతిష్టల నిమిత్తము, అధికార పదవుల నిమిత్తము కాదు.

మద్రాసు ఆబట్స్‌బరీలో 22011982 తేదీ భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం.